# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలో 50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**2.** **జీఎస్టీ శ్లాబుల సరళీకరణతో పర్యాటక, సినిమా రంగాలు అభివృద్ధి సాధిస్తాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.**

**3.** **రాష్ట్రంలో పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ బీసీ యువతకు ఉచిత శిక్షణ అందించినందుకు గాను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖకు స్కోచ్ అవార్డు లభించింది.**

**4.** **జిఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.**

**5.** **తిరుమల స్వామివారి ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా రేపు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుంచి సుమారు 12 గంటల పాటు మూసి వేయనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.**

==========================

పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల జ్ఞాపక శక్తి పెరుగుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మొఘల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో 50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపరలో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్మార్ట్ కార్డుతో రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

---------------------------

గుంటూరు జిల్లా తురకపాలెంలో కొందరికి మెలియాయిడోసిస్ అనే వ్యాధి వచ్చినట్లుగా గుర్తించినట్లు

కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ..

– వాయిస్...31 సెకన్లు

---------------------------

జీఎస్టీ శ్లాబుల సరళీకరణతో పర్యాటక, సినిమా రంగాలు అభివృద్ధి సాధిస్తాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ పర్యాటకానికి ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కు అభినందనలు తెలిపారు.

---------------------------

జిఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువుల జిఎస్టి శ్లాబ్‌ను మారుస్తూ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నిర్ణయాన్ని విజయనగరం వాసులు స్వాగతిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సామాన్యులపై భారం పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. విజయనగరానికి చెందిన అప్పారావు జిఎస్టీ సంస్కరణలపై ఆకాశవాణితో మాట్లాడుతూ..

– వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ బీసీ యువతకు ఉచిత శిక్షణ అందించినందుకుగాను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖకు స్కోచ్ అవార్డు లభించింది. ఈ అవార్డు రావడం పట్ల బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగ బీసీ యువతను ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నత స్థానాల్లో నిలపాలన్న లక్ష్యంతో శిక్షణ అందజేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు.

---------------------------

దేశంలో నీటి కొరత నిర్వహణకు సంబంధించి పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు జల వనరుల సంరక్షణ భారతదేశంలో జాతీయ ప్రాధాన్యతగా మారింది. ఇందులో భాగంగా ఈ సవాళ్లను పరిష్కరించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లోని సూరత్‌లో 2024 సెప్టెంబర్ 6న 'జల్ సంచయ్ జన్ భాగీదారి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ రోజుతో ఈ కార్యక్రమం ఏడాదిని పూర్తి చేసుకుంది. జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమం కింద నీటిని పరిరక్షించడం, వర్షపు నీటి ఆధారిత పంటలను ప్రోత్సహించడం, సమర్థవంతమైన భాగస్వామ్యంతో, స్థిరమైన సాగు పద్ధతులు వంటి అంశాలపై ప్రజల్లో కేంద్ర ప్రభుత్వం విస్తృత అవగాహన కల్పిస్తోంది.

---------------------------

చంద్రగ్రహణం కారణంగా రేపు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుంచి సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సుమారు 12 గంటల పాటు మూసి వేయనున్నట్లు

తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి, ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి దర్శనం భక్తులకు పునః ప్రారంభమవుతుందని టిటిడి పేర్కొంది.

మరోవైపు విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి వద్ద కూడా ఇదే తరహాలో ఆలయం మూసి వేయనున్నట్లు ఆలయ అధికారులు చెప్పారు. తిరుపతి జిల్లాలోని వాయులింగ క్షేత్రం శ్రీకాళహస్తి ఆలయాన్ని మాత్రం తెరిచి ఉంచనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

---------------------------

జీఎస్టీ రేట్ల హేతుబద్దీకరణతో రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ వైస్ చైర్మన్ తుమ్మల కుటుంబరావు అన్నారు. జిఎస్టీ సంస్కరణలపై విజయవాడలో ఆయన ఈరోజు ఆకాశవాణి తో మాట్లాడుతూ.. పేద–మధ్య తరగతి తో పాటు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ రంగాల్లో కొత్త జీఎస్టీ స్లాబ్స్ కీలక మార్పులు తీసుకొస్తాయని వివరిస్తూ..

– వాయిస్.. 29 సెకన్లు

---------------------------

ఈనెల 9వ తేదీ నుంచి దుబాయ్ వేదికగా ప్రారంభమైన ఆసియా కప్ క్రికెట్ పోటీలు ఈనెల 28వ తేదీ వరకు జరుగుతాయి. మొదట మ్యాచ్ ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ జట్ల మధ్య జరుగుతుంది. ఈనెల 10వ తేదీన యూఏఈతో భారత్ తొలి మ్యాచ్ ఆడుతుంది.

---------------------------

రైతులకు యూరియా అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. యూరియా నిల్వలకు సంబంధించి జిల్లా కలెక్టర్ పలు ఫెర్టిలైజర్ దుకాణాలను ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్... 29 సెకన్లు

---------------------------

పశ్చిమ వాయవ్య దిశగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఆంధ్రప్రదేశ్ ఒడిషా, తెలంగాణా వైపు కదిలే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..19 సెకన్లు

---------------------------

ఈ రోజు అంతర్జాతీయ రాబందుల అవగాహనా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. రాబందులు అనగానే మనందరికీ మనసులో ప్రతికూల భావనే కలుగుతుంది. కానీ..., సమస్త జీవ కోటికి అవి చేస్తున్న పారిశుధ్య సేవ అనన్య సామాన్యమైంది. ప్రపంచంలో మనుషులకు మాత్రమే మరణానంతరం అంత్యక్రియలు జరుపుతారు. మానవేతర కళేబరాలన్ని ప్రకృతిలో అలాగే ఉండి పోతాయి. అయితే అవి ఆ కళేబరాలను ఆహారంగా స్వీకరించి...ప్రాకృతిక పరిశుభ్రతను పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతున్నాయి. రాబందులు ఆ పని చేయకపోతే ...మనం అనేక రకాల వైరస్‌ల బారిన పడి ప్రమాదంలో పడతాము. అందుకే.... రాబందులను పరిరక్షించుకునేందుకు సెప్టెంబరు నెల మొదటి శనివారాన్ని అంతర్జాతీయ రాబందుల అవగాహనా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

=====================